

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -151 పేజీలు - 8 వెల ₹03/- సోమవారం 7 సెప్టెంబర్ 2026

ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం

ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు

మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి

ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు



ఢిల్లీ సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి.**మిగతా 2లో...**

ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ

మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ

అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో

ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి



ఢిల్లీ సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది**మిగతా 2లో....**

సాత్విక్-చిరాగ్ సంచలనం..

చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం



చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్

ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం

తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం

ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్

గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ

ఢిల్లీ సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ**మిగతా 2లో...**

కొత్త పింఛన్లకు దరఖాస్తులు

నేటి నుంచి 16 వరకు స్వీకరణ

ఎన్టీఆర్ భరోసాలో కొత్త అధ్యాయం

మరింత మందికి సామాజిక భద్రత

ఇప్పటికే 62 లక్షల మందికి భరోసా

కొత్త పింఛన్ల ప్రక్రియకు ప్రత్యేక ఏర్పాటు



అమరావతి, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):


రాష్ట్రంలో కొత్త పింఛన్లకోసం ఎంతగానో ఎదురు చూస్తున్న పేదలకుప్రభుత్వం తీపి కబురు అందించింది. నేటి నుంచి ఈనెల 16వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. ఇప్పటికే సామాజిక భద్రత పింఛన్లతో 62 లక్షల మంది పేదలకు ప్రతినెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు,దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంకింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది.**మిగతా 2లో...**

మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

నాలుగు స్థాయిల్లో నార్కో సమన్వయ కేంద్రాలు

మార్చి2029 నాటికి మత్తు చిత్తు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



పనాజీ:**సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం గోవాలోమీడియాతో మాట్లాడుతూ, 2029 నాటికి భారతదేశాన్నిపూర్తిగా మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు మోడీ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందనితెలిపారు. మాదకద్రవ్యాలు లేని యువశక్తి 2047 నాటికివికసిత భారత్ను నడిపిస్తుందనేది ప్రధాని నరేంద్ర మోడీలక్ష్యమని పేర్కొన్నారు. నక్సలిజం, ఉగ్రవాదం వంటి ముప్పులను ఎలా **మిగతా 2లో...**

ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి

: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్

బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్

హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం,





అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం

కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు

సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి

అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం

ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

హైదరాబాద్ : సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది.

ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం **మిగతా 2లో...**

8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

హైదరాబాద్ : సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

దేశంలోని న్యాయవ్యవస్థలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల మేరకు ఎనిమిది హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను (సీజే) నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు **2లో...**



ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం రంగంలోకి ఐఐటీ మద్రాస్ నిపుణులు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో కదులుతున్న పనులు



అమరావతి, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

దశాబ్దాలుగా సముద్ర కోతతో విలవిలలాడుతున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీరప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి.**మిగతా 2లో...**

ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌చార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

ప్రస్తుత ఇన్‌చార్జ్ మాణికం ఠాగూర్‌పై వేటు

ఏపీకి చెందిన సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర ఇన్‌చార్జ్ బాధ్యతలు

పంజాబ్‌కు సచిన్ పైలట్, అస్సాంకు భూపేష్ భగేల్ ఇన్‌చార్జ్‌లు

నియామకాలను ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



అమరావతి, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీలో పలు కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా కర్ణాటకకు**మిగతా 2లో...**

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

అసెంబ్లీ సమావేశాల తర్వాత పాదయాత్ర

మొదటిపేజీ తరువాయి

వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు.“ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం“ అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను ‘నిషేధిత జాబితా‘లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.

అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. “ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు“ అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు.

ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. ‘ఆరు గ్యారెంటీలు‘, రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

ఇస్రో ప్రైవేటీకరణ అవాస్తవం

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ‘ఎక్స్‘ వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. “ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది“ అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది “ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ“కు నాంది పలుకుతుందని వివరించింది.

భవిష్యత్ లక్ష్యాలు ఇవే..

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి ‘భారతీయ అంతరిక్ష్ స్టేషన్‘ ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.

ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

ఢిల్లీలో కూలిన భవనం.. ముగ్గురి మృతి

మొదటిపేజీ తరువాయి

శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. “ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి“ అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. “ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి“ అని ఆయన ‘ఎక్స్‘లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.

సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.

ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, “భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం“ అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్న కేసీఆర్

తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి

: మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ డిమాండ్

బీఆర్ ఎస్ పదేండ్ల పాలన.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనపై చర్చకు సిద్ధమంటూ సవాల్

హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అజారుద్దీన్,

పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు



హైదరాబాద్‌సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్):

ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి రాని బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ఉ ఆ హోదాను అపహాస్యం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న ఆయన సభకు రాకపోవటం అత్యంత శోచనీయమని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో తక్షణం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ ఆయన కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఇదే అంశంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు సారధ్యంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ రెడ్డి, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ‘పదేండ్ల పాలనలో బీఆర్ ఎస్ రాష్ట్రానికి ఏం ఒరగబెట్టిందో.. రెండున్నరేండ్లలో కాంగ్రెస్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందో చర్చించేందుకు మేం సిద్ధం.. మీరు సిద్ధమా?’ అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు.

బీఆర్ ఎస్ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలుఉ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష బాధ్యత ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానిది కీలక పాత్ర అని చెప్పారు. కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఆయన అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలని కేసీఆర్ ను నిలదీశారు. అధికారం ప్రజలిచ్చే కానుకని, వారి ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే తమ ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి అనేక హామీలను అమలు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లిస్తామని చెప్పి ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు భిన్నంగా ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని హితవు పలికారు. పదేండ్ల కాలంలో విదేశీ పెట్టుబడులు ఏ మేరకు తెచ్చారో చెప్పాలని నిలదీశారు.

తాము రెండున్నరేండ్లలో రూ.లక్షా 78వేల కోట్లు విదేశీ పెట్టుబడులతోపాటు గ్లోబల్ సమ్మిట్‌తో రూ. ఐదు లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. 70వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చామని, ఇంకో రెండున్నరేండ్లలో మరిన్ని ఉద్యోగాలు ఇచ్చితీరుతామని హామీనిచ్చారు. ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీని కేసీఆర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తమ ప్రభుత్వం వారిని సముచితంగా గౌరవించిందని గుర్తు చేశారు. కుల సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని వివరించారు. బీజేపీ నేతలు తమ ప్రభుత్వం గురించి వ్యంగంగా మాట్లాడటం తప్ప వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్‌ను కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. ఒకవేళ అల్లుడు, కొడుక్కి అవకాశం ఇవ్వాలనుకుంటే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని కేసీఆర్ కు సలహానిచ్చారు.

గత బీఆర్ఎస్ పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణ అప్పులపాలైందని వాపోయారు. ఆ ప్రభుత్వం రూ. ఎనిమిదిన్నర లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిందని, ఈ క్రమంలో తాము ఓ వైపు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కేసీఆర్ వైద్య రంగాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. స్కిల్ యూనివర్శిటీతో యువతలో నైపుణ్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును తొక్కిపెట్టి ఆయా తరగతుల నోటికాడి కూడును లాక్కుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మెడలు వంచైనా సరేడ బీసీల గణనను కులగణనలో చేర్పిస్తామని చెప్పారు.

ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రాజెక్టు డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ప్రతిష్ఠాత్మక ఐఐటీ-మద్రాస్ నిపుణుల బృందం రంగంలోకి దిగింది.

గత వారం రోజులుగా ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం ఉప్పాడ తీరంలో క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించింది. అత్యాధునిక డ్రోన్లు, బీచ్ ప్రొఫైలింగ్, ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్-ఎస్ ఆర్‌టీకే వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీరం వెంబడి సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. సముద్ర గర్భంలోనూ, తీరం పొడవునా భౌగోళిక పరిస్థితులు, అలల తీవ్రత, సముద్ర ప్రవాహాల దిశ, కోతకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగా సముద్రపు లోతును కొలిచే బాతిమెట్రిక్ సర్వేతో పాటు, తీరంలోని ఇసుక, మట్టి నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నారు.

గత 40 ఏళ్లుగా ఉప్పాడ తీరంలో సముద్ర కోత కారణంగా వందల ఎకరాల భూమి, కొన్ని గ్రామాలు సముద్రంలో కలిసిపోయాయి. ఎందరో మత్స్యకారులు, రైతులు సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నడుం బిగించిన పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.323 కోట్ల జాతీయ విపత్తు నిర్వహణ నిధిని సాధించారు.

ఈ ప్రాజెక్టు పనులను పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. డిజైన్, డీపీఆర్ రూపకల్పనతో పాటు సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలో పిఠాపురం పర్యటన సందర్భంగా ఐఐటీ నిపుణులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ఐఐటీ మద్రాస్ ఇచ్చే నివేదిక ఆధారంగా రక్షణ గోడ డిజైన్‌ను ఖరారు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

సాత్విక్-చిరాగ్ సంచలనం..

మొదటిపేజీ తరువాయి

హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.

నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.

ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

ఏపీ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌చార్జ్.. పీవీ మోహన్‌కు బాధ్యతలు

మొదటిపేజీ తరువాయి

చెందిన ఎమ్మెల్సీ పీవీ మోహన్‌ను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న తమిళనాడు ఎంపీ మాణికం ఠాగూర్‌ను తప్పించి, ఆయన స్థానంలో మోహన్‌కు బాధ్యతలు అప్పగించింది.

ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఈ నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న పీవీ మోహన్, గతంలో కేరళ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేశారు. తాజా మార్పులతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు కూడా కొత్త ఇన్‌చార్జ్‌లను నియమించారు.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నేత సిరివెళ్ల ప్రసాద్‌కు మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదేవిధంగా, రాజస్థాన్ సీనియర్ నేత సచిన్ పైలట్‌కు పంజాబ్ ఇన్‌చార్జ్‌గా, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్‌కు అస్సాం ఇన్‌చార్జ్‌గా, రాజ్యసభ సభ్యుడు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు గుజరాత్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు కేటాయించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

కొత్త పింఛన్లకు దరఖాస్తులు

మొదటిపేజీ తరువాయి

సోమవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్తపింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు.

రూ. 4,000 పింఛన్.. కొత్త అర్హులకు గొప్ప అవకాశం

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తోంది. అయితే, వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలకు, నూతనంగా అర్హత సాధించిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

నూతన పింఛన్ల ప్రక్రియ - పూర్తి షెడ్యూల్

సెప్టెంబర్ 7 16: నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.

సెప్టెంబర్ 17 21: జనరల్ వెరిఫికేషన్ (సాధారణ పరిశీలన).

సెప్టెంబర్ 22 24: ఫిజికల్, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హతల నిర్ణయం.

సెప్టెంబర్ 25 26: ‘సెర్ప్‘ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.

దరఖాస్తు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ‘స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు‘ ((గ్రామ/వార్డు సచివాలయ) కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు.దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు, సదుపాయాలు ఏర్పాటు చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు అవసరమైన పత్రాలతో సమీప సచివాలయానికి వెళ్ళి తమ దరఖాస్తులను అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారు.

8 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు..

మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. ఈ నియామకాల వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్‘ వేదికగా వెల్లడించారు. కొలీజియం సిఫార్సు చేసిన కొద్ది రోజులకే కేంద్రం వేగంగా స్పందించి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయడం గమనార్హం.

నియామకాల వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వల్లూరి కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అదేవిధంగా బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రవీంద్ర వి. ఘుగే కలకత్తా హైకోర్టుకు నేతృత్వం వహించనున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్‌ను రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి బాంబే హైకోర్టు కొత్త సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

మూడేళ్లలో డ్రగ్స్ రహిత భారత్

మొదటిపేజీ తరువాయి

అరికట్టామో, అదే పద్ధతిలో మాదకద్ర వ్యాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతా మని ధీమా వ్యక్తం చేశారు. 2014కు ముందు మాదకద్రవ్యాలపైపోరాటం చిన్న చిన్న విభాగాల్లో, ఒంటరిగా సాగేదని, ఏజెన్సీలు చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవని అమిత్ షా గుర్తు చేశారు. డ్రగ్స్పై ఈ పోరాటాన్నిజాతీయ భద్రతా ప్రాధాన్యతగా మోడీ ప్రభుత్వంమార్చిందని చెప్పారు.

నాలుగు స్థాయిల్లోనార్కో సమన్వయ కేంద్రాలు2019లో నాలుగు స్థాయిల నార్కో సమన్వయ కేంద్రం ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోప్రత్యేక మాదకద్రవ్య నిరోధక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటుచేశారు. మాదకద్రవ్య నియంత్రణ బ్యూరోను పునర్వ్యవస్థీకరించి బలోపేతం చేశారు. నిడాన్ పోర్టల్ ద్వారా నేరస్తులజాతీయ డేటాబేస్ సృష్టించారు. 1933 మానస్ హెల్ప్ లైన్ప్రారంభించి బాధిత యువతకు పునరావాసం అందిస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు.

కార్యాచరణ ప్రణాళిక నాలుగు స్తంభాలపై ఆధారపడిఉంది. మేధస్సు, కార్యాచరణ ఆధారిత అమలు, సింథటిక్‌మాదకద్రవ్యాలు, పూర్వగామి రసాయనాల నియంత్రణ,డిమాండ్ తగ్గింపు, హాని తగ్గింపు, సామర్థ్య నిర్మాణం, సమన్వయం. దిగువ నుంచి పైకి, పై నుంచి కిందికి దర్యాప్తు విధానం అవలంబ

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

లక్షలు వెచ్చించారు లక్షణంగా వదిలేశారు

అభివృద్ధి పనులకు నోచుకోని చిట్టాపూర్ గ్రామం.

అధికారుల వైఫల్య లోపం కారణమా..?

కాంట్రాక్టర్ల లోపమా..?

మధ్యంతరంగా నిలిచిపోయిన అంగన్వాడి భవనం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.



నూతన గ్రామ సచివాలయం

మల్లాపూర్ సెప్టెంబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలోని 10 సంవత్సరాల క్రితం మొదలుపెట్టిన అంగన్వాడీ భవనం పూర్తయి ఇప్పటికి పూర్తిస్థాయి మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. వాటికి తలుపులు, కిటికీలు, ఎలక్ట్రిసిటీ లేక మధ్యంతరంగా ఆగిపోయింది. పది సంవత్సరాల క్రితం పూర్తయినటువంటి భవనము ఇప్పటికి ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. అంగన్వాడి భవనం నిర్మాణానికి చెందిన కాంట్రాక్టర్ అతనికి బిల్లులు రాలేదని వాపోతున్నాడు. ప్రభుత్వ కార్యాలయల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయానని కాంట్రాక్టర్ చెప్పుకొచ్చారు.

భవన నిర్మాణం పూర్తి అయ్యి కూడా ప్రారంభోత్సవానికి నోచుకోలేని నూతన గ్రామ సచివాలయం

ఏడాది దాటినా ఒక్క రూపాయి కూడా రాని బిల్లులు

ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. భవన నిర్మాణానికి సంబంధించి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదని కాంట్రాక్టర్ వాపోతున్నారు. ఈ భవనము నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఇప్పటివరకు కూడా ఓపెనింగ్ కాలేదు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి సదరు కాంట్రాక్టర్లకు రావలసిన డబ్బులు ఇప్పించి గ్రామపంచాయతీ ప్రారంభానికి సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మధ్యంతరంగా ఆగిపోయిన ప్రాథమిక వైద్య కేంద్రం

ప్రాథమిక వైద్య కేంద్రం అనేది ప్రజలకు ఎంతో అవసరం జబ్బు పడినవారు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ మందుల పంపిణీ చేస్తున్నారు. ప్రాథమిక వైద్య కేంద్రాన్ని నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేయడానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియ రాలేదు. దయచేసి మా ప్రజల బాధలను అర్థం చేసుకొని, అధికారుల యంత్రాంగం తమ తమ బాధ్యతలని నిబద్ధతతో పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.పాత గ్రామపంచాయతీలోనే విద్యుత్ శాఖ వారు అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, గ్రామ సెక్రెటరీ, గ్రామపంచాయతీ సర్పంచ్, ఇతరులు అరకోర వసతుల మధ్య వారి విధులను నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నూతన భవనాలను ప్రజల సౌకర్యార్థం, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



10 సంవత్సరాల క్రితం నిర్మించిన అంగన్వాడి కేంద్రం

ఉత్తమ ఉపాధ్యాయునికి చిన్ననాటి మిత్రుల ఘన సన్మానం.



మల్లాపూర్ సెప్టెంబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన సీమల రాజు నడికుడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తున్నారు. ఇటీవలే ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నందుకు గాను 1999- 2000 పదో తరగతి చిన్ననాటి మిత్రులు అందరు కలిసి ఘనంగా సన్మానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో గడ్డం లింగారెడ్డి, దువ్వ నవీన్, బద్దం లక్ష్మారెడ్డి, పాశం గంగాధర్, బక్కురి రాజశేఖర్, ధోని పాల నరేష్, జోగ రాజు, చిటిమెల్లి అశోక్, కడకుంట్ల ప్రకాష్, లక్కం రాములు, రాజోజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బారసాలలో బాబును ఆశీర్వదించిన భరత్ కుమార్ రెడ్డి.





రైల్వే కోడూరు సెప్టెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్.

రైల్వే కోడూరు నియోజకవర్గం రాఘవ రాజుపురం పంచాయతీలోని రాఘవరాజపురం హరిజనవాడకు చెందిన, వైయస్సార్ సిపి కార్యకర్త చిన్న పిలుపుమేరకు చిన్న మనవడి బారసాల కార్యక్రమానికి ఆదివారం హాజరై బాబును ఆశీర్వదించిన వైఎస్ఆర్సిపి రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి కార్యకర్తలు రెడ్డయ్య, శ్రీరాములు, వెంకటేశు, రమణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు

ఆశ్రమం సందర్శించిన డిప్యూటీ ఏ. ఇ, నరసింహులు. ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ బృందం అన్నదానం.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్.



ఓబులవారిపల్లె మండలం పెద్దఓరం పాడు పంచాయతీ పాపిరెడ్డి పల్లె గ్రామంలోని అప్పారావు సర్కిల్ జీవనజ్యోతి ఆనంద నిలయ శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం ను ఆదివారం మండలప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆర్ డబ్ల్యు ఎస్ విభాగంలో డిప్యూటీ ఏ.ఇ గా విధులు నిర్వహిస్తూన్న నర్సింహులు సందర్శించారు, ఆశ్రమం నందు వృద్ధులను ప్రత్యేకంగా పలుకరిస్తూ ఆశ్రమం శుభ్రత పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకుంటూ ప్రతిరోజు అందిస్తున్న ఆహారం త్రాగునీరు ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలపండి అని ఒక్కొక్కరిని విచారించి అడిగి తెలుసుకున్నారు,అనంతరం ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ బృందం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో డిప్యూటీ ఏ. ఇ నరసింహులు చేతుల మీదుగా భోజనాలను వడ్డించి అందరితో కలిసి భోజనం చేయడం జరిగినది.ఆశ్రమానికి సహాయం చేయడం అలవాటుగా మార్చుకోవడం, మానవత్వం మన అందరిదీ, మానవ సేవే మాధవ సేవ అనే నినాదాలు పైన కొనసాగుతున్న ఆశ్రమం సందర్శించు గొప్ప అవకాశం దొరికినందుకు చాలా ఆనందంగా ఉందని డిప్యూటీ ఏ ఇ నరసింహులు తెలిపారు, ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ బృందం నిత్య అన్నదానంలో ఒక భాగమై ఆశ్రమం ప్రారంభం నుండి నేటి వరకు జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమంకు సేవలు అందించడం ఆర్కే హెల్పింగ్ హాండ్స్ దిన దినాభివృద్ధి చెందాలని ఆశ్రమంలో ఆకలి తీర్చుకున్న ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వర్షాభావ పరిస్థితులను రైతులు అర్థం చేసుకోవాలి

త్రాగునీటి అవసరాలకే నీటి విడుదల : ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గౌరు చరితారెడ్డి





బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 6.(రిపబ్లిక్ న్యూస్):-

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను రైతులు అర్థం చేసుకోవాలని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రజల త్రాగునీరు, పశువుల త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి విడుదల చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఇందులో భాగంగా ఆదివారం ఇరువురు ఎమ్మెల్యేలు నీటి పారుదల శాఖ అధికారులతో కలిసిఎర్రగూడూరు కెనాల్ లాక్ ఇన్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటి విడుదల చేశారు. అంతకంటే ముందుగా గంగమ్మకు ప్రత్యేక పూజలు జరిపించి సారే సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూసూపర్ ఎల్ నినో పరిస్థితులను రైతులు అర్థం చేసుకోవాలనీ కోరారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 60 శాతానికి పైగా లోటు వర్షపాతం నమోదయిందన్నారు. సూపర్ ఎల్ నీనో ప్రభావంతో ప్రపంచమే అతలాకుతలం అవుతుందన్నారు. ఎండలు అంటే తెలియని దేశాలు సైతం ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్నాయని ఎమ్మెల్యేలు వివరించారు. ఎల్ నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని దయచేసి రైతులు ఎవరు పంటలు సాగు చేయవద్దని విన్నవించారు. ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీటిని సర్దుబాటు చేసుకుంటూ వచ్చే జూన్ వరకు త్రాగునీటి అవసరాలకు ఉపయోగించుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో బావులు, బోర్ లు, వాగులు, వంకలు ఎండిపోయి తాగునీటికి ఇబ్బందులు మొదలయ్యాయనీ తెలిపారు. త్రాగునీటి సమస్యను అధిగమించేందుకు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు అందరం కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు నీటి విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నీటిని ప్రజలు, పశువుల త్రాగునీటికి మాత్రమే వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. వైసిపి నాయకులు రైతులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారనీ మండిపడ్డారు. వారి మాయమాటలు నమ్మి రైతులు పంటలు సాగు చేసి నష్టపోవద్దని కోరారు. ప్రస్తుతం విడుదల చేసిన నీరు అన్ని గ్రామాలకు చేరే విధంగా ప్రత్యేక కమిటీలు కూడ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు సమన్వయం చేసుకుంటూ ప్రతి ఒక్క గ్రామానికి నీటి సరఫరా జరిగే విధంగా చూసుకుంటున్నామని ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట శ్రీశైలం,పాణ్యం నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ఉచిత సీట్ సాధించిన బి. సాయిశివానిని అభినందించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే



కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)



కల్లూరు మండలం : కొంగనపాడు గ్రామానికి చెందిన బి. మల్లికార్జున రాధిక దంపతుల కుమార్తె బి. సాయిశివాని ప్రతిష్టాత్మకంగా వీడీడీఓ ఉచిత సీట్ సాధించిన సందర్భంగా వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి సాయిశివానిని హృదయపూర్వకంగా అభినందించి, శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, భవిష్యత్తులో ఎందరో పేదలకు సేవలందించే గొప్ప వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి అక్కిమి హనుమంత రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, 28వ వార్డు మాజీ కార్పొరేటర్ ఇప్పల నారాయణరెడ్డి ,గ్రామ నాయకులు కేశవ రెడ్డి ,వెంకటేశ్వర్లు ,తెలుగు ఏళ్ళకృష్ణ ,బోయ తిమ్మన్న ,షేక్ మాసమ్ భాష ,నాగయ్య,తెలుగు బజారీ , నిదీష్, తదితరులు పాల్గొన్నారు

గౌరు జనార్దన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా

గౌరు జనార్దన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగాసోమయాజుల పల్లెలోబ్లడ్ డొనేషన్ క్యాంపు కార్యక్రమం

ఓర్వకల్లు ప్రతినిధి, సెప్టెంబర్ 6 (రిపబ్లిక్ న్యూస్)

పాణ్యం నియోజకవర్గ టిడిపియువజన నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె గ్రామంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా సోమయాజులపల్లె గ్రామ నాయకులు నాగమల్లేష్ కుమారుడు మహేంద్ర పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓర్వకల్ మండల టీడీపీ అధ్యక్షులు దుగ్గపూటి నాగిరెడ్డి గ్రామ నాయకులు నాగ మల్లేష్, రామకృష్ణ, ప్రతాప్ నాయుడు, రామకృష్ణారెడ్డి , రమణ, మన్మధ రావు , గౌరు యూత్ ,గ్రామ ప్రజలు ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.



బోయలకుంట్లలో అనంత పద్మనాభ స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల పునర్నిర్మానానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.







ఆళ్లగడ్డ సెప్టెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ తాలూకా సిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామంలో పురాతన శ్రీ అనంత పద్మనాభ స్వామి మరియు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాల పునర్నిర్మాణ పనులకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.సుమారు రూ. కోటి వ్యయంతో చేపట్టనున్న ఆలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోయలకుంట్ల గ్రామానికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ పురాతన ఆలయాలను పునర్నిర్మించడం సంతోషకరమైన విషయమన్నారు. ఆలయాలు కేవలం ప్రార్థనా మందిరాలు మాత్రమే కాకుండా.. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు.పురాతన ఆలయాల వైభవాన్ని కాపాడుతూ, భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఆలయ పునర్నిర్మాణ పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఆలయాల అభివృద్ధితో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెరగడంతో పాటు, భక్తులకు మెరుగైన సౌకర్యాలుఅందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సంబంధిత వారికి సూచించారు.పురాతన ఆలయాల పరిరక్షణకు పెద్దపీట.. ఆధ్యాత్మిక వైభవాన్ని కాపాడటమే లక్ష్యం..బోయలకుంట్లలో రూ. కోటి వ్యయంతో ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

ప్రజల సమస్యలకే ప్రాధాన్యం. ఆళ్లగడ్డ అభివృద్ధే మా లక్ష్యం

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

నాపీ కాంపౌండ్‌లో "మన భూమా మన ధీమా" కార్యక్రమం





ఆళ్లగడ్డ సెప్టెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణంలోని నాపీ కాంపౌండ్ నందు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ "మన భూమా మన ధీమా" కార్యక్రమాన్నినిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

అదే సమయంలో స్థానిక ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రధానంగా డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల అవసరం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తాం" అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు.తాగునీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయకుండా చూడాలని, నీరు వృథా కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.అలాగే రైతులు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన నీటిని ముందుగా చెరువులు, కుంటలు నింపుకోవడంతో పాటు భవిష్యత్ తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

తాగునీటి అవసరాలకు ఉపయోగపడాల్సిన నీటిని సాగునీటి కోసం అధికంగా వినియోగిస్తే భవిష్యత్‌లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల నీటి వినియోగంలో రైతులు, ప్రజలు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కోరారు.ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలుతెలుసుకోవడం.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం.. ఆళ్లగడ్డ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం ఇదే "మన భూమా మన ధీమా" కార్యక్రమం ప్రధాన లక్ష్యం. అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

పుంగనూరులో ఫలించిన 'ఐక్యత రాగం'

చౌడేపల్లి టీడీపీలో నూతనోత్సాహం...! -ఒకటైన వెంకటరమణారెడ్డి, పతి రాజులు

చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబరు 06 రిపబ్లిక్ న్యూస్

పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండల తెలుగుదేశం పార్టీలో దీర్ఘకాలంగా నెలకొన్న రాజకీయ అస్పష్టతకు తెరపడింది. పార్టీలో కీలక నేతలుగా ఉన్న బోయకొండ మాజీ చైర్మన్ ఎస్.కె. వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకుడు మాదిరాజు లక్ష్మణ రాజు (పతి రాజు) తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనబెట్టి చేతులు కలిపారు. ఈ ఐక్యతతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చౌడేపల్లి మండలంలో తిరుగులేని ఆధిక్యత సాధిస్తామని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



ఆగస్త్యేశ్వర స్వామి సన్నిధిలో ఐక్యతా ఘట్టం

గత కొంతకాలంగా ఎడ ముఖం పెడముఖంగా ఉన్న ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, మండల సీనియర్ నాయకుడు ఆవుల రామచంద్రయ్య మరికొందరు సీనియర్ నాయకులు కీలక పాత్ర పోషించారు. ఆగస్త్యేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో వీరి సమక్షంలో చర్చలు జరిపి, ఇరువురి మధ్య ఉన్న పొరపొచ్చాలను తొలగించారు. స్వామివారి సాక్షిగా ఇద్దరు నేతలు పాత పగలను మరచి ఆత్మీయంగా కరచాలనం చేసుకున్నారు. గతంలో వ్యక్తిగత, వ్యూహాత్మక కారణాల వల్ల వీరు అధిష్టానం వద్ద పరస్పర ఆరోపణలు చేసుకునేవారు. అయితే, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ విడివిడిగా ఉండటం వల్ల పార్టీకి, కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతుందని గ్రహించిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వీరిని ఏకం చేయడంలో సఫలీకృతమయ్యారు. ఆలయంలో కలయిక అనంతరం ఇద్దరు నేతలు ఒకరి ఇళ్లకు ఒకరు వెళ్లి స్నేహపూర్వక వాతావరణంలో చర్చించుకోవడంతో కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. ఇద్దరు దిగ్గజ నేతలు కలవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలకు కొండంత అండ లభించినట్లయింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు గట్టి పోటీ ఇచ్చేందుకు, వార్డు స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసే దిశగా ఇద్దరు నేతలు నాయకులు కార్యకర్తల సమక్షంలో చర్చించుకున్నారు నేతల మధ్య ఇదే ఐక్యత కొనసాగితే చౌడేపల్లి మండలంలో టీడీపీకి తిరుగుండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

ఇద్దరు కీలక నేతల కలయికతో చౌడేపల్లి మండలంలో పార్టీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగిందని పలువురు అన్నారు నాయకుల ఐక్యతే ఆయుధంగా రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని స్థానిక టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

మేడిపల్లి మండల ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా క్యాతం రాజేశ్వర్ రెడ్డి ప్రజాధ కార్యదర్శిగా మేదరి ఆశీర్వాదం

రాయికల్ మండలం సెప్టెంబర్, 06(రిపబ్లిక్ న్యూస్)

ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ మేడిపల్లి మండల అధ్యక్షులుగా క్యాతం రాజేశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా మేదరి ఆశీర్వాదంను జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడపు రాజమౌళి నియమించడం జరిగింది ఇందుకు సహకరించిన జాతీయ అధ్యక్షుడు ఎస్కే మాజీద్ మేరకు జాతీయ చైర్మన్ సిరీన్ మార్గదర్శిలో ఉండడం జరుగుతుందని ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానంగా వ్యవహరించి ప్రజల సమస్యలు ఏమన్నా ఉంటే మేము అందుబాటులో ఉండి వీరిని అన్ని విధాలుగా సమస్యలు తీర్చగలమని అలాగే ప్రభుత్వానికి సేవ చేయాలనే తపనతో మేము మీకు అందుబాటులో ఉంటామని ఇంటర్నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులు ఖ్యాతం రాజేశ్వర్ రెడ్డి మదరి ఆశీర్వాదం తెలిపాడు



AOPA వారిచే ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 6 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణంలో AOPA ఆధ్వర్యంలో, డాక్టర్ రామసుబ్రహ్మణ్యం తండ్రి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన AOPA సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగాఅభినందించారు.కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు.ప్రజలకు సేవ చేయాలనే మంచి ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమని, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ూూూూ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యతగా.. సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గం స్థానిక సంస్థల ఎన్నికల సపోర్టు టీం సభ్యుడిగా గా చిన్నతోటి నాగరాజు..

రేణిగుంట సెప్టెంబర్ :6 (రిపబ్లిక్ న్యూస్)



తిరుపతి పార్లమెంట్ శ్రీకాళహస్తి నియోజకవర్గం స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ మెంబర్ గా శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజుకు అవకాశం లభించింది. తిరుపతి జిల్లా జనసేన పార్టీలో అతిరథ మహారథులు మధ్య శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి విద్యావంతుడు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి ఉన్నతమైన కుటుంబంలో పెరిగి మెగాస్టార్ కుటుంబం పై ప్రేమ అభిమానాలు కలిగి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆదేశాలనుసారం క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వర్తిస్తూన్న రేణిగుంట మండలాధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు ను జనసేన పార్టీ అధిష్టానం ఎన్నుకోవడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదంలో గాయపడిన రిపోర్టర్ రామారావును పరామర్శించిన పాల ఎకిరి కార్పొరేషన్ చైర్మన్



చౌడేపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 06 రిపబ్లిక్ న్యూస్

ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక చౌడేపల్లి రిపోర్టర్ రామారావును పలువురు నాయకులు పరామర్శించారు.బీసీ పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరావు గారు రిపోర్టర్ రామారావును కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.తన కలం ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో రామారావు ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.ప్రమాదంలో గాయపడిన రామారావు త్వరగా కోలుకుని తిరిగి విధుల్లోకి రావాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైర్మన్ పగడాల హరిప్రసాద్, టిడిపి నాయకులు వేణుగోపాల్ నాయుడు, ప్రతాప్, బిజెపి నాయకులు ఉత్తరాది హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయిలోరాయికల్ ప్రగతి హై స్కూల్ సత్తా

-బెస్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్2026 అవార్డు కైవసం

రాయికల్ మండలం సెప్టెంబర్,06(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ ప్రగతి హైస్కూల్ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. నేషనల్ స్కూల్ అవార్డ్స్2026లో "బెస్ట్ స్కూల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్2026" విభాగంలో ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును పాఠశాల యాజమాన్యం ఆదివారం అందుకుంది.న్యూఢిల్లీ ద్వారకలోని ఐటీసీ హోటల్ లో ఆదివారం నిర్వహించిన నేషనల్ స్కూల్ అవార్డ్స్2026 పురస్కార ప్రదానోత్సవంలో ఈ అవార్డును ప్రగతి హైస్కూల్ అకాడమిక్ డైరెక్టర్ బాలె నిఖిల్ కుమార్,యాజమాన్య ప్రతినిధులు గోపాల్ రెడ్డి,మల్లేష్ స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ విభాగంలో ప్రగతి హై స్కూల్ ఎంపికై జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సమర్థవంతమైన పాఠశాల నిర్వహణ, క్రమశిక్షణ, ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు ఈ జాతీయ గుర్తింపు లభించడం గర్వకారణమని పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ పేర్కొన్నారు. ఈ అవార్డు పాఠశాల భవిష్యత్ ప్రగతికి మరింత స్ఫూర్తినిస్తుందని తెలిపారు.రాయికల్ ప్రగతి విద్యాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల విద్యాభిమానులు, పూర్వ విద్యార్థులు, స్థానికులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల కేబినెట్ మంత్రి చిరాగ్ పాస్వాన్,ఎన్ఎస్ఏ ఫౌండర్ శిఖా, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ పార్లమెంటు లోక్ సభ డాక్టర్ ప్రభాకర్, డిప్యూటీ డైరెక్టర్ లోక్ సభ సెక్రటేరియట్ నిఖిల్ మిగ్లాని,డా. గౌరవ్ కపూర్, సుమిత్ వర్మ,సోమా సింగ్,అభిషేక్ కె. యాదవ్, నీనా భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

లోకియా నాయక్ తశీడకు చెందిన భూక్యా అక్షరా రాథోడ్ ఉస్మానియా యూనివర్సిటీ మెడికల్ కాలేజీలో సీటు సాధించి నా అక్షర రాథోడ్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి అక్షరకు తల్లిదండ్రులకు గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్ మండలం సెప్టెంబర్.06(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ మంగత్యా నాయక్ తాండ గ్రామ పంచాయతీ లోక్యా నాయక్ తండ కి చెందినభూక్యా రత్తిలాల్ రాజేశ్వరి గార్ల కూతురు అక్షర రాథోడ్ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించి ఉస్మానియా లో ఎంబీబీఎస్ లో వైద్య విద్య సీటు సాధించి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవగా అక్షర ను వారి కుటుంబ సభ్యులను అభినందించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్షర సాధించిన ఈ విజయం ఆమె కష్టపడి చదివిన తీరుకు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహానికి నిదర్శనం. మారుమూల తండా





ప్రాంతం నుంచి వచ్చి ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యలో సీటు సాధించడం ద్వారా అక్షర ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు.

వైద్య విద్యను పూర్తి చేసి మంచి వైద్యురాలిగా ఎదిగి, పేదలు మరియు సామాన్య ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి జగిత్యాల జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు.

ఈ కార్యక్రమంలో మంగ్య నాయక్ తండా గ్రామ ప్రజా ప్రతినిధులు అక్షరా తల్లిదండ్రులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయికల్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ విశ్వశాంతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు





రాయికల్ మండలం సెప్టెంబర్.06(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ విశ్వశాంతి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీవిద్యార్థులందరూ ఒక్కరోజుఉపాధ్యాయ,ఉపాధ్యాయునీలుగా మారి తోటి విద్యార్థులకు చాలా చక్కగా పాఠాలు బోధించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ

ఈరోజు మనందరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. సెప్టెంబర్ 5న మనం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటాము.

మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, ఉపాధ్యాయులు మనకు జ్ఞానాన్ని అందించి మంచి మార్గంలో నడిపిస్తారు.

అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే వారు గురువులు. మనలో ఉన్న ప్రతిభను గుర్తించి, మన భవిష్యత్తుకు బలమైన పునాది వేసే వారు ఉపాధ్యాయులు.భారతదేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాము. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించరు. క్రమశిక్షణ, మంచి నడవడి, నిజాయితీ, బాధ్యత మరియు మానవతా విలువలను కూడా నేర్పిస్తారు.

ఈ ప్రత్యేకమైన రోజున మా ఉపాధ్యాయులందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు మాకు అందిస్తున్న జ్ఞానం మరియు మార్గదర్శకత్వాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాము.

గురువు బ్రహ్మ, గురువు విష్ణు, గురువు దేవో మహేశ్వరః అని మన భారతీయ సంస్కృతి గురువుకు ఎంతో గొప్ప స్థానం ఇచ్చింది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్ మరియు ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అఫ్సర్ , రజిత, సంజన, ఇందుజ, మంజుల, స్రవంతి, కవిత ,సాయి హర్ష, దీపిక,శివాని, సౌజన్య ,కళ్యాణి, మాలతి, అహల్య,గాయత్రి,గీత రాణి, ప్రవళిక,కావ్య,ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం చట్టసభలో బీసీలకు 34% రిజర్వేషన్ ను స్వాగతిస్తున్నం

ఆంధ్రప్రదేశ్ వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం





చిప్పగిరి, సెప్టెంబర్,6,(రిపబ్లిక్ న్యూస్)

ఆలూరు నియోజకవర్గంలో ఆరు మండలాలలో వీరశైవ జంగమ కుటుంబాలను సందర్శించి, వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులను తెలుసుకున్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు. సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బీసీలకు చట్టసభలో 34% రేజర్వేషన్లు కల్పించాలని తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం స్వాగతిస్తూ, హర్షం వ్యక్తంచేసింది. జనాభాలో 50% పైగా ఉన్న బడుగు బలహీన వర్గాలు ప్రజలు విద్య పరంగా, పాలనా శక్తి ఉన్నా, ఆర్థికంగా బలంగా లేకపోవడంతో మిగతా కులాల వారితో పోటీపడలేక, రాజకీయ గుర్తింపు పొందలేక పోతున్నారు. వీరశైవ జంగములు అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించాలని, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మరొక్కసారి హర్షం వ్యక్తం చేస్తూ, అలాగె కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ కల్పించడం వలన క్రియాశీలకంగా కష్టపడి పనిచేస్తున్న అన్ని కులాల కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఆంధ్ర ప్రదేశ్ వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం ఆశిస్తుంది. కూటమి ప్రభుత్వం జంగమ కులానికి కార్పొరేషన్ చైర్మన్ నియమించింది కానీ వాటికి ఇంకా డైరెక్టర్లను నియమించలేదు, అంతేకాక చైర్మన్ గా వస్తున్నా వ్యక్తులకు కులాలపై పూర్తి అవగాహన ఉండట్లేదు, కులసంఘాలు, కులస్తుల అభివృద్ధికి కృషిచేస్తున్న చైర్మన్లు ఎక్కడో దూరపు జిల్లాలలో ఉండటం వలన, కులసంఘాలు ప్రభుత్వానికి సత్సంబంధాలు లేక వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే వారులేక స్థానికి జిల్లాలలో డైరెక్టర్లు లేక చాల సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి అని తెలియచేస్తూ, ప్రభుత్వం వీలైనంత త్వరగా ఆంధ్రప్రదేశ్ వీరశైవ జంగమ కార్పొరేషన్లో డైరెక్టర్ లను ప్రభుత్వం వెంటనే నియమించాలని కోరూతు, అది కూడా సంఘాలతో సత్సంబంధాలు ఉన్నవారికి కులాలపై అవగాహనా ఉన్నవారికి అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది.అనంతరం (శ్రీశైలం, కాణిపాకం, మహానంది, శ్రీకాళహస్తి) శ్రీశైలంలో సేవా క్షేత్రాలలో పాలక మండలిలో వీరశైవ జంగమలకు సభ్యత్వం ఆర్డినేన్సు వెంటనే కల్పించాలని, ఆంధ్ర ప్రదేశ్ వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం కూటమి ప్రభుత్వానికి విన్నవించుకుంది. శ్రీ ఉరుకుంద ఈరన్న దేవాలయం చైర్మెన్ పాండురంగ శెట్టి ని కలిసి, ఉరుకుంద క్షేత్రం శ్రీ వీరభద్ర క్షేత్రం కాబట్టి శ్రీ వీరభద్ర జయంతిని ఈనెల సెప్టెంబర్ 15న నిర్వహించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమం తనంతరం ఆదోని ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా ప్రమోషన్ పొందిన ఎం.పురుషోత్తం ను సన్మానము చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వీరశైవ జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జేపీ మల్లికార్జునయ్య, కార్యదర్శి అల్మూరు మఠం విజయ్ కుమార్ స్వామి, కోశాధికారి నందుల మఠం చంద్రశేఖర్, సలహాదారులు నందుల మఠం గంగాధర శాస్త్రి, సభ్యులు శివ మహేష్, దేవనకొండ వీరయ్య, చాముండేశ్వరి, ఆలూరు పట్టణ శాఖలో రామలింగయ్య స్వామి, రవి శంకర్ స్వామి, ప్రసాద్ స్వామి, విశ్వేశ్వరయ్య స్వామి, మల్లికార్జున స్వామి, మల్లి, సంతోష్, తదితురులు పాల్గొన్నారు.

42వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం'.. 1.04 కోట్ల కుటుంబాల సందర్శన

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. 42వ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ద్వారా టీడీపీ శ్రేణులు ఇప్పటివరకు 1.04 కోట్ల కుటుంబాలను నేరుగా కలిశాయి. కేవలం ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 1,54,454 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో టీడీపీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేద వర్గాలకు అందుతున్న సంక్షేమ ఫలాలను తెలియజేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అభిప్రాయాలను కూడా టీడీపీ నేతలు ఓపిగ్గా అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పనితీరుపై ప్రత్యక్షంగా ప్రజా స్పందనను సేకరిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న సూచనలు, సలహాలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, టీడీపీ శ్రేణులతో పాటు సాధారణ ప్రజలు కూడా భాగస్వాములవుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మరింత విస్తృతంగా, విజయవంతంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నాయి.

అయోధ్య ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 50 వేల రూపాయల కంప్యూటర్ గిఫ్టుగా ఇచ్చిన గ్రామ పెద్దలు ఎడమల పురుషోత్తం రెడ్డి, వినోద్ రెడ్డిలు



రాయికల్ మండలం సెప్టెంబర్,06(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అయోధ్య ఎంపీ యుపిఎస్ పాఠశాలకు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం గ్రామానికి చెందిన ఎడమల పురుషోత్తం రెడ్డి, వినోద్ రెడ్డి కుటుంబ సభ్యులు రూపాయలు 50,000 విలువైన కంప్యూటర్ను శనివారం విరాలశీగా అందజేశారు పాఠశాల అభివృద్ధికి వారు అందించిన ఈ సహకారం ఎంతో అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్ తాలూకా రాజేశం దాతలకు విద్య ర్థులు, ఉపాధ్యాయులు ఉపసర్పంచ్ తాలూకా రాజేశం కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

దేవుడి మాన్యం, తదితర భూముల కౌలు రైతుల కట్టిన డబ్బులు ఇప్పించాలని ఎమ్మెల్యేల ను కోరిన రైతు బీవీ.నాగేశ్వరరావు

పాములపాడు సెప్టెంబర్-6 రిపబ్లిక్ న్యూస్:-



పాములపాడు మండలంలోని, ఎర్రగూడూరు గ్రామ సమీపాన తుడిచెర్ల, వేల్పనూరు కేసీ కెనాల్ లాకిన్స్ ల దగ్గర జరిగిన రైతుల మరియు ఎమ్మెల్యేల సమావేశంలో కౌలు రైతు బుద్దానగర్ గ్రామంకి చెందిన బీవీ.నాగేశ్వరావు, తదితర ప్రాంతాల రైతులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మరియు నంద్యాల జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షులు & పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ని సూపర్ ఎలినో ప్రభావం వలన వర్షాలు పడక పోవడంతో పంటలు వేసుకోలేని పరిస్థితి ఉన్నందున, ముందు డబ్బులు కట్టి కౌలు కి తీసుకున్న పొలాలకు భూ యజమానుల తో మాట్లాడి తమ డబ్బులను వెనిక్కి ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా.రాజశేఖర్ రెడ్డి, గౌరు.చరితా రెడ్డి లు మాట్లాడుతూ ఖచ్చితంగా గ్రామ పెద్దలు, లీడర్లు కలిసి ఒక కమిటీగా ఏర్పడి న్యాయం చేస్తామని కౌలు రైతులకు భరోసా ఇచ్చారు. కౌలు రైతులు ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపి, సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కే.సి.కెనాల్ డీసీ చైర్మన్ కట్ట.పరమేశ్వర రెడ్డి, టిడిపి మండల నాయకుడు మద్దూరు జి.తిమ్మారెడ్డి, ఎర్రగూడూరు చెల్లె.హరినాథ్ రెడ్డి, మండల మాండ్ర సేవాదళ్ నాయకుడు భావన రాము, రెండు నియోజకవర్గం రైతులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ మైసమ్మ తల్లి తిరుణాల

ముఖ్య అతిథులుగా కస్తూరి, కె.కె, పంతగాని.



రైల్వే కోడూరుసెప్టెంబరు6 రిపబ్లిక్ న్యూస్





చిట్వేలి మండలంలోని కె.ఎస్. అగ్రహారం గ్రామం నందు ఆదివారం శ్రీశ్రీశ్రీ మైసమ్మ తల్లి తిరుణాల ఘనంగా నిర్వహించడం జరిగినది, మైసమ్మ తల్లి తిరుణాల సందర్భంగా ప్రముఖ కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులురెడ్డి ఆహ్వానం మేరకు వారి స్వగృహం నందు ఏర్పాటు చేసినటువంటి విందు ఆతిథ్యాన్ని స్వీకరించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, నగిరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ కార్పొరేషన్ చైర్మన్ కె.కె. చౌదరి,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతి విభాగ అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్,మరియు ప్రముఖ పారిశ్రామిక మాచినేని విశ్వేశ్వర నాయుడు,ఈ కార్యక్రమంలో కస్తూరి విశ్వనాథ నాయుడుతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, రాజకీయ పార్టీ నేతలు మరియు బంధుమిత్రులు పాల్గొనడం జరిగినది.

రాజమండ్రిలో కుండపోత.. రోడ్లన్నీ జలమయం

రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.ఆదివారం సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే భారీగా నిలిచిపోయింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా దానవాయిపేట, ఆవారోడ్డు, ప్రకాశ్ నగర్ సహా పలు ప్రధాన కూడళ్లలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

ప్రజల విశ్వాసమే కొండంత బలం

అర్బన్ బ్యాంక్ 110వ మహాజనసభ

బ్యాంక్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం

చైర్మన్ డా. జె.ఎల్. మురళీధర్

అనంతపురం సంక్షేమం,సెప్టెంబర్ 06,(రిపబ్లిక్ న్యూస్):
ప్రజల విశ్వాసమే కొండంత బలమని బ్యాంక్ చైర్మన్ డా. జె.ఎల్. మురళీధర్ పేర్కొన్నారు. 110 ఏళ్లుగా సేవలందిస్తున్న అనంతపురం అర్బన్ బ్యాంక్ మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. అనంతపురం అర్బన్ బ్యాంక్ 110వ మహాజనసభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ వార్షిక నివేదిక, ప్రస్తుత కార్యకలాపాలు, ఖాతాదారులకు అందుతున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సభ్యులతో చర్చించారు.

బ్యాంక్ ప్రగతిలో సిబ్బంది సహకారం మరువలేనిది

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఒక సంస్థ 110 ఏళ్లుగా ప్రజల నమ్మకాన్ని పొందుతూ కొనసాగడం గర్వకారణమన్నారు. బ్యాంక్ ప్రగతిలో సభ్యులు, ఖాతాదారులు, సిబ్బంది అందిస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఖాతాదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. బ్యాంక్‌ను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యుల సంక్షేమం, ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా సేవలను విస్తరించడమే లక్ష్యమన్నారు.



నాణ్యమైన సేవలతో మరింత ప్రగతిని సాధిద్దాం

ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చడంలో అర్బన్ బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్‌లోనూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ మరింత ప్రగతి సాధించేలా పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేస్తారని చెప్పారు. బ్యాంక్‌పై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకత, సేవా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. మహాజనసభలో బ్యాంక్ వైస్ చైర్మన్లు చింతల భాస్కర్, జంగంశెట్టి రామాంజినేయులు, డైరెక్టర్లు సుబ్రమణ్యం, కృష్ణకుమార్, బావిగడ్డ రమణయ్య, గోల్డ్ భాష, మాగిశెట్టి చంద్రశేఖర్, వెంకటాద్రి, రోల్ల భాస్కర్, అనీల్ నాయుడు, పుల్లప్ప, గిరీష్, బీఓఎం సభ్యులు విజయ్ భాస్కర్, సునీల్ రాయల్, సందర్శ్, బ్యాంక్ సీఈఓ నవీన్, మేనేజర్లు ఖాజా, మేఘన, రాధ, హేమ, రాము, సతీష్, చంద్రశేఖర్, బ్యాంక్ సిబ్బంది, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో వార్షిక నివేదికపై చర్చించడంతో పాటు బ్యాంక్ భవిష్యత్ కార్యాచరణ, సేవల విస్తరణ, సంస్థ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు.

ధరల దెబ్బకు సామాన్యుడి బతుకు భారం

నిత్యావసర ధరలను నియంత్రించాలి

ఉల్లిని కిలో రూ.25కే విక్రయించాలి

తోపుడుబండిపై కూరగాయలతో సీపీఎం వినూత్న నిరసన

అనంతపురం క్లాక్ టవర్, సెప్టెంబర్ 06,(రిపబ్లిక్ న్యూస్):
నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్యుడి ను చిత్తు చేస్తున్నాయని సీపీఎం నగర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ధరల పెరుగుదలతో పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించింది. నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే నియంత్రించాలని, ఉల్లిపాయలను ప్రభుత్వమే రైతుల నుంచి కొనుగోలు చేసి రైతుబజార్లలో కిలో రూ.25కే విక్రయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద వినూత్న నిరసన చేపట్టారు. తోపుడుబండిపై నిత్యావసర సరుకులు, కూరగాయలను ఉంచి వాటి ధరల పెరుగుదలను ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వాల తీరును నిరసించారు.

కుటుంబాలు అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి

ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల సామాన్య కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతోందన్నారు. ఆదాయాలు అంతంతమాత్రంగానే ఉన్నా ప్రతిరోజూ ఉపయోగించే సరుకుల ధరలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణపై దృష్టి పెట్టకుండా కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా పండుగల సమయంలో ధరల పెరుగుదల సామాన్యులకు మరింత భారంగా మారుతోందన్నారు.



నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి

పండుగల నేపథ్యంలో ఏ వంట చేసుకోవాలన్నా నూనె, కందిపప్పు, శనగపప్పు, బియ్యం, పామాయిల్, బెల్లం, చక్కెర వంటి సరుకుల ధరలు కుటుంబాలను ఆలోచించేలా చేస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా చక్కెర ధర గతంలో కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.75కు చేరిందని రామిరెడ్డి తెలిపారు. చక్కెర ధర ఇంతలా పెరిగినా దాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు మార్కెట్లపై నిరంతర పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. సరుకులను అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం, అక్రమ నిల్వలపై చర్యలు లేకపోవడం వల్లే వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు.

అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలి

రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదని రామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు పండించిన ఉల్లిపాయలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వాటిని నిల్వ ఉంచి ప్రస్తుతం అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు అందుబాటు ధర లభించేలా ప్రభుత్వం మార్కెట్ వ్యవస్థను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ప్రభుత్వమే ఉల్లిని కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా కిలో రూ.25కే ప్రజలకు అందిస్తే రైతులకు, వినియోగదారులకు కొంత మేర ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలను అదుపులోకి తీసుకురావడంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలని, పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ధరల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల నిత్యజీవితాన్ని నేరుగా ప్రభావితం చేస్తున్న ధరల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, రమేష్, నగర కార్యదర్శివర్గ సభ్యులు కిచ్చప్, ఇర్ఫాన్, ఏంజెల్స్, వలి, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీను, తిరుమలేశు, రాజు, డీవైఎఫ్ఐ నాయకులు ఇజ్రాయిల్, సాయి, మహేంద్ర, సీఐటీయూ నాయకులు శంకర, నవీన్, మహమ్మద్ వలి, ముని, రియాజ్, సుబహాన్, తిమ్మరాజు, రవి, శీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'మస్జిద్ ఏ సఫీ' శంకుస్థాపన

ఆధ్యాత్మిక అభివృద్ధికి పవిత్ర నిర్మాణాలు దోహదం -భారీగా తరలివచ్చిన మతపెద్దలు, ప్రముఖులు





అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 06,(రిపబ్లిక్ న్యూస్):
అనంతపురం నగరంలో " మస్జిద్ ఏ సఫీ " నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్హజ్ కె.ఎం. షకీల్ సఫీ కుటుంబం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పవిత్ర నిర్మాణ కార్యక్రమానికి జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, ముతవల్లిలు, ఇమాములు, మౌజన్లు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

సఫీ కుటుంబానికి అభినందనలు :
శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, మాజీ గ్రంథాలయ చైర్మన్ జె. గౌస్ మొయిద్దీన్, హాస్పిటల్ కమిటీ సభ్యులు గంగారాం, టౌన్ బ్యాంక్ చైర్మన్ జె.ఎల్. మురళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవర్ల మురళి, అనంతపురం టీడీపీ నగర అధ్యక్షులు సుధాకర్ యాదవ్, మార్కెట్ వైస్ చైర్మన్ కె.ఎం. అర్షద్, టీడీపీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు కె.ఎ. రహమతుల్లా తనయుడు కె.ఎం. అరాఫత్, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి, టీడీపీ కార్యాలయ కార్యదర్శి మెహఫిల్ తాజ్ తదితరులు పాల్గొని సఫీ కుటుంబానికి అభినందనలు తెలిపారు.

భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనకరం :
ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు వేదికలుగా మస్జిద్‌లు నిలుస్తున్నాయని అన్నారు. " మస్జిద్ ఏ సఫీ " నిర్మాణానికి ముందుకు వచ్చిన కె.ఎం. షకీల్ సఫీ కుటుంబం సేవాభావాన్ని అభినందించారు. సమాజ శ్రేయస్సు, ఆధ్యాత్మిక అభివృద్ధికి ఉపయోగపడే ఇలాంటి పవిత్ర నిర్మాణాలు భవిష్యత్ తరాలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మస్జిద్ నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని, ఈ పవిత్ర కార్యానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ అల్లాహ్ కృప లభించాలని ఆకాంక్షించారు.

ఈ పవిత్ర నిర్మాణం ఆధ్యాత్మికంగా దోహదపడాలి :
మస్జిద్ ఏ సఫీ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా వందలాది మంది ముతవల్లిలు, ఇమాములు, మౌజన్లు, ముస్లిం మతపెద్దలు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. సఫీ కుటుంబ సభ్యులు, నిర్వాహకులు హాజరైన అతిథులకు స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ పవిత్ర నిర్మాణం సమాజానికి ఆధ్యాత్మికంగా, సామాజికంగా మరింత సేవ చేయడానికి దోహదపడాలని పలువురు ఆకాంక్షించారు.

భోగాపురంలో దారుణం: డబ్బులివ్వలేదని యువకుడికి

తాళ్లు కట్టి, బైక్‌తో లాక్కెళ్లిన మెకానిక్



భోగాపురంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. చిన్నపాటి నగదు బాకీ కోసం ఓ యువకుడి మెడకు, చేతులకు తాళ్లు కట్టి, నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లిన దారుణం స్థానికంగా కలకలం రేపింది. బాధితుడి ఫిర్యాదుతో తీవ్రంగా స్పందించిన పోలీసులు, ఈ ఘటనకు పాల్పడిన ప్రధాన నిందితుడు మహేశ్‌తో సహా మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేసి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.పోలీసుల కథనం ప్రకారం, రామచంద్రరాజుపేటకు చెందిన రాజేశ్ అనే యువకుడు, భోగాపురంలోని మహేశ్ అనే మెకానిక్ వద్ద ఓ బైక్‌ను ట్రయల్ రన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ కారును ఢీకొట్టాడు. దానికి అయిన మరమ్మతుల ఖర్చును మహేశ్ సోదరుడు చెల్లించగా, ఆ డబ్బును రాజేశ్ తిరిగి ఇవ్వడంలో ఆలస్యం చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మహేశ్, తన స్నేహితులతో కలిసి రాజేశ్ ను అడ్డగించి, బలవంతంగా ఓ మెకానిక్ షెడ్‌కు తీసుకెళ్లారు. రాత్రంతా అక్కడే నిర్బంధించి, చితకబాది, రూ. 30,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంతటితో ఆగకుండా, ఆదివారం ఉదయం రాజేశ్ చొక్కా విప్పించి, చేతులకు, మెడకు తాళ్లు బిగించి భోగాపురం వీధుల్లో బైక్‌కు కట్టి ఈడ్చుకెళ్లారు. ఈ అమానుష దృశ్యాన్ని చూసి చలించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హుటాహుటిన భోగాపురం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గంటల వ్యవధిలోనే నిందితులు ఐదుగురినీ అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. నిందితులపై హత్యాయత్నం (అటెంప్ట్ మర్డర్), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిందితులందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

ఎస్‌బీఐ భారీ విస్తరణ..


12,000 కొత్త ఉద్యోగాలు, 250 కొత్త బ్రాంచ్‌లు



దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరుద్యోగులకు, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు తీపి కబురు అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (ఎఫ్‌27) సుమారు 12,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 250 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు.

ఈ నియామక ప్రక్రియలో భాగంగా క్లరికల్ (జూనియర్ అసోసియేట్), ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్) కేడర్లలో దాదాపు 11,000 నుంచి 12,000 మందిని తీసుకోనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భర్తీ ప్రక్రియ ఉంటుందని ఆయన వివరించారు. గతేడాది (2025-26) బ్యాంకు సుమారు 1,500 మంది ఐటీ స్పెషలిస్ట్ ఆఫీసర్లతో సహా మొత్తం 25,633 మందిని నియమించుకుంది. అయితే, ఈసారి ఐటీ రంగంలో అంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఉండవని, జనరల్ బ్యాంకింగ్ సిబ్బందికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఒకవైపు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్నప్పటికీ, భౌతిక బ్రాంచ్‌ల ప్రాధాన్యాన్ని కూడా బ్యాంకు గుర్తిస్తోందని చైర్మన్ అన్నారు. ఇందులో భాగంగా, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఏటా నికరంగా 200 నుంచి 250 కొత్త శాఖలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, కొన్ని పాత బ్రాంచ్‌లను హేతుబద్ధీకరించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని తెలుస్తోంది. 2026 మార్చి నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది. తాజా నియామకాలతో బ్యాంకు తన సేవలను మరింత విస్తృతం చేయాలని భావిస్తోంది.

ప్రజలు, టెక్నాలజీ, మూలధనంపై చైనా ఉక్కుపాదం..



ప్రజలు, మూలధనం, కీలక సాంకేతిక పరిజ్ఞానం దేశం దాటిపోకుండా చైనా ప్రభుత్వం తన పట్టును మరింత బిగిస్తోంది. ఈ క్రమంలోనే, దేశ పౌరులు విదేశాలకు వెళ్లడంపై కఠినమైన నిబంధనలను తీసుకువచ్చింది. పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని భావిస్తే, పౌరులను దేశం విడిచి వెళ్లకుండా నిరోధించేందుకు అధికారులకు అధికారం కల్పించే ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి.

సున్నితమైన టెక్నాలజీ, డేటా, నైపుణ్యం కలిగిన నిపుణులు విదేశాలకు తరలిపోకుండా నిరోధించేందుకు చైనా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. చైనాకు చెందిన 'మనుస్' అనే ఏఐ స్టార్టప్‌ను 2 బిలియన్ డాలర్లతో కొనుగోలు చేసేందుకు మెటా చేసిన ప్రతిపాదనను చైనా అడ్డుకోవడమే ఇందుకు నిదర్శనం. జాతీయ భద్రత కారణాలను చూపుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ ఒప్పందాన్ని డ్రాగన్ సర్కార్ రద్దు చేసింది.

కొత్త నిబంధనల ప్రకారం, టెక్నాలజీ దిగుమతి లేదా ఎగుమతి నిబంధనలను ఉల్లంఘించి దేశ పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ప్రమాదం కలిగించే వారిని దేశం విడిచి వెళ్లకుండా నిరోధించవచ్చు. అంతేకాకుండా, విదేశాల్లో చైనా జాతీయ భద్రతకు, ప్రయోజనాలకు హాని కలిగించే నేరాలకు పాల్పడిన వారు దేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు విదేశాలకు వెళ్లకుండా నిషేధం ఎదుర్కోవలసి ఉంటుంది.

ఈ ఆంక్షలు కేవలం ప్రజలకే పరిమితం కాలేదు. దేశం నుంచి మూలధనం, వ్యూహాత్మక ఆస్తులు తరలిపోకుండా నిరోధించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఒక వ్యక్తి ఏడాదికి 50,000 డాలర్ల కంటే ఎక్కువ విదేశీ మారకాన్ని కొనుగోలు చేయరాదనే నిబంధన ఇప్పటికే ఉంది. గతేడాది చైనా వాణిజ్య మిగులు రికార్డు స్థాయిలో 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో, చైనా కంపెనీలు, వ్యక్తులు భారీగా విదేశీ ఆస్తులు, సెక్యూరిటీలలో పెట్టుబడులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వం నిఘాను మరింత కఠినతరం చేసింది.ఇదేకాకుండా, చైనా స్టేట్ కౌన్సిల్ జూన్‌లో విడుదల చేసిన నిబంధనల ప్రకారం, పెట్టుబడిదారులు నియంత్రిత టెక్నాలజీ, డేటా, ఇతర నియంత్రిత వస్తువులు లేదా సేవలను విదేశీ పెట్టుబడుల ద్వారా ఎగుమతి చేయడాన్ని నిషేధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు, వీసా ఆంక్షలు, ఇండస్ట్రీ బ్లాక్‌లిస్టింగ్ వంటి శిక్షలు విధించనున్నారు.

ప్రారంభమైన బిగ్ బాస్ తెలుగు సీజన్ 10

హౌస్‌లోకి అడుగుపెట్టిన 16 మంది కంటెస్టెంట్లు

గుప్పెడంత మనసు 'రిషి' సహా పలువురు ప్రముఖులు

ఈసారి సామాన్యులకు కూడా అవకాశం కల్పించిన బిగ్ బాస్



తెలుగు టెలివిజన్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించారు. ఈ సీజన్‌లో సినీ, టీవీ ప్రముఖులతో పాటు, 'అగ్నిపరీక్ష' అనే ప్రత్యేక ప్రక్రియ ద్వారా ఎంపికైన సామాన్యులకు కూడా అవకాశం కల్పించారు. గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్‌లో మొత్తం 16 మంది కంటెస్టెంట్లు బిగ్ బాస్ హౌస్‌లోకి అడుగుపెట్టారు. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన ఈ కంటెస్టెంట్ల పూర్తి వివరాలు కింద ఉన్నాయి.

బిగ్ బాస్ 10 కంటెస్టెంట్లు:

1. దేబ్జానీ మోదక్: 'ఎన్నెన్నో జన్మల బంధం' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె, 'గిరగిరా గింగిరాని వే' పాటకు డ్యాన్స్ చేస్తూ హౌస్‌లోకి మొదటి కంటెస్టెంట్‌గా ప్రవేశించారు.

2. త్రిగుణ్: గతంలో అదిత్ అరుణ్ పేరుతో సినిమాలు చేసిన ఈయన, తన పేరును త్రిగుణ్‌గా మార్చుకున్నారు. బిగ్ బాస్ ద్వారా ఫ్యామిలీ ఆడియన్స్‌కు మరింత దగ్గరవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

3. ఝాన్సీ: సింగర్‌గా గుర్తింపు పొందిన ఈమె, గోల్డెన్ టికెట్ విజేతగా హౌస్‌లోకి అడుగుపెట్టారు. 'రైతు బిడ్డ' పాటను భావోద్వేగంగా పాడి అందరినీ ఆకట్టుకున్నారు.

4. సుధీర్ రెడ్డి (సుధీర్ టాక్స్): ప్రముఖ పాడ్‌కాస్టర్‌గా సోషల్ మీడియాలో గుర్తింపు పొందిన సుధీర్, తన జీవితంలోని కష్టాలను నాగార్జునతో పంచుకున్నారు.

5. అమన్: 'అగ్నిపరీక్ష'లో అత్యధిక ఓట్లు సాధించి ఎంపికైన కంటెస్టెంట్. తాను గేమ్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఫ్లిప్ అవ్వనని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

6. చైత్ర రాయ్: 'అష్టచమ్మా' సీరియల్‌తో 'స్వప్న'గా పేరుగాంచిన ఈమె, పెళ్లి తర్వాత బరువు పెరగడంపై వచ్చిన ట్రోలింగ్‌ను సవాలుగా తీసుకుని 20 కిలోలు తగ్గినట్లు తెలిపారు.

7. ఆటో రామ్ ప్రసాద్: జబర్దస్త్ కమెడియన్‌గా సుపరిచితుడైన రామ్ ప్రసాద్, తనదైన కామెడీ పంచ్‌లతో హౌస్‌లోకి ఎనర్జిటిక్‌గా ఎంట్రీ ఇచ్చారు.

8. షాలిని: జ్యూరీ సభ్యుడు నవీన్ చేత ఎంపికైన సామాన్యురాలు. తాను చాలా ఎక్కువగా మాట్లాడతానని, నాగార్జునను ప్రశంసలతో ముంచెత్తారు.

9. టెంపర్ వంశీ: 'టెంపర్', 'నేనింతే' వంటి చిత్రాల్లో ప్రతినాయక పాత్రలతో గుర్తింపు పొందిన వంశీ, తనలోని ఎమోషనల్, ఫ్యామిలీ మ్యాన్ కోణాన్ని ప్రేక్షకులకు చూపించాలని వచ్చానని చెప్పారు.

10. సృష్టి వ్యాకరణం: జ్యూరీ సభ్యురాలు, మాజీ కంటెస్టెంట్ శ్రీముఖి చేత ఎంపికయ్యారు. తన సంకల్పమే తన బలమని, ఇతరులను సులభంగా నమ్మడం బలహీనత అని తెలిపారు.

11. నరేశ్ (పాట్టి నరేశ్): జబర్దస్త్ ఫేమ్ నరేశ్, గూగుల్‌లో తన పేరు వెతికితే 'బిగ్ బాస్ 10 నరేశ్' అని రావాలనే లక్ష్యంతో షోలోకి వచ్చినట్లు చెప్పారు.

12. అర్జే చరణ్: ఆడియన్స్ ఓటింగ్ ద్వారా ఎంపికైన చరణ్, తన చుట్టూ ఉన్నవారిని నవ్వించడమే తన బలమని, తాను చిరంజీవికి, నాగార్జునకు పెద్ద అభిమానినని పేర్కొన్నారు.

13. కృష్ణుడు: 'హ్యాపీ డేస్', 'వినాయకుడు' వంటి చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కృష్ణుడు, తన బరువు వెనుక ఉన్న కథను పంచుకున్నారు. తాను అమాయకుడిని కాదని, తనలోని మరో కోణాన్ని చూపిస్తానని అన్నారు.

14. వర్షిణి సౌందరరాజన్: యాంకర్, నటిగా గుర్తింపు పొందిన వర్షిణి, మొదట బిగ్ బాస్ ఆలోచన లేకపోయినా, కాలక్రమేణా ఆసక్తి పెరిగిందని తెలిపారు.

15. రోహిత్: జ్యూరీ సభ్యురాలు బిందు మాధవి ఎంపిక చేసిన సామాన్య యువకుడు. హౌస్‌లోని ఒకరిపై నీళ్లు చల్లాలనే టాస్క్‌ను సున్నితంగా తిరస్కరించి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.

16. ముఖేశ్ గౌడ: 'గుప్పెడంత మనసు' సీరియల్‌తో 'రిషి'గా తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ముఖేశ్, 16వ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టారు. తన మాతృభాష కన్నడ అయినా, తెలుగు తన గుండెల్లో ఉందని, తన తెలుగులో తప్పులుంటే క్షమించాలని కోరారు.

ఇలా విభిన్న రంగాలకు, నేపథ్యాలకు చెందిన 16 మందితో బిగ్ బాస్ హౌస్ కళకళలాడుతోంది. వంద రోజుల పాటు సాగే ఈ ప్రయాణంలో ఎవరు ప్రేక్షకులను మెప్పించి టైటిల్ విజేతగా నిలుస్తారో వేచి చూడాలి.

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో 'మన ప్యానెల్' హవా.. అధ్యక్షుడిగా సి. కల్యాణ్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (2026-28) నూతన కార్యవర్గం కోసం జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో 'మన ప్యానెల్', 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' మధ్య ప్రధాన పోటీ జరగ్గా, 'మన ప్యానెల్' స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి కీలక పదవులను కైవసం చేసుకుంది. అధ్యక్ష పదవికి సి. కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.

ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 1,168 మంది సభ్యులకు గాను 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. అత్యంత కీలకమైన కోశాధికారి (ట్రెజరర్) పదవికి 'మన ప్యానెల్' నుంచి పోటీ చేసిన చదలవాడ శ్రీనివాసరావు విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవులకు 'మన ప్యానెల్' నుంచి మోహన్ వడ్లపల్లి, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా 'మన ప్యానెల్' అభ్యర్థులు అమ్మిరాజు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గెలుపొందారు.

ఇక కార్యవర్గ సభ్యుల (ఈసీ మెంబర్స్) పదవుల్లోనూ



'మన ప్యానెల్' హవా కొనసాగింది. ఈ ప్యానెల్ నుంచి పద్మిని, ఏషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణప్రసాద్, దానయ్య సహా మొత్తం 12 మంది విజయం సాధించగా, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డీఎస్ రావు సహా ముగ్గురు గెలుపొందారు. అయితే, ప్రధాన కార్యదర్శి పదవి ఎన్నిక కోర్టు కేసు కారణంగా ప్రస్తుతానికి నిలిచిపోయింది.

ఈ సందర్భంగా అధ్యక్షుడు సి. కల్యాణ్ మాట్లాడుతూ, తమ ప్యానెల్‌కు దాదాపు 95 శాతం మద్దతు ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా చిన్న నిర్మాతలు ఎదుర్కొంటున్న విడుదల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులపై దృష్టి సారిస్తామన్నారు. వారి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన బండ్ల గణేశ్‌కు ధన్యవాదాలు చెబుతూ, ఇకపై అందరం కలిసికట్టుగా పనిచేస్తామని పిలుపునిచ్చారు.

చంద్రబోస్ తనయుడి వివాహ రిసెప్షన్ హాజరైన మెగాస్టార్ చిరంజీవి



ప్రముఖ సినీ గీత రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చంద్రబోస్, ప్రముఖ కొరియోగ్రాఫర్ సుచిత్ర దంపతుల కుమారుడు నంద వివాహం శృతి అనే యువతితో అత్యంత వైభవంగా జరిగింది. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఈ వివాహ రిసెప్షన్ వేడుకలకు కుటుంబ సభ్యులు, ఆప్తమిత్రులతో పాటు టాలీవుడ్ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన మెగాస్టార్ చిరంజీవి, నూతన దంపతులు నంద వనమాలి, శృతిలను మనసారా ఆశీర్వదించారు. చంద్రబోస్ దంపతులతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకుంటూ, వారి కుటుంబ వేడుకలో పాలుపంచుకున్నారు. చిరంజీవి రాకతో వేడుక ప్రాంగణంలో కొత్త శోభ సంతరించుకుంది. ఆయన నూతన వధూవరులతో ఫొటోలు దిగి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ పెళ్లి వేడుకలో మరో విశేషం అందరినీ ఆకట్టుకుంది. చంద్రబోస్ తన భార్య సుచిత్రతో కలిసి వేదికపై ఉత్సాహంగా స్టెప్పులేశారు. అలాగే, సుచిత్ర తన నూతన కోడలు శ్రుతితో కలిసి డ్యాన్స్ చేసి అందరినీ అలరించారు. అత్తాకోడళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ దృశ్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఆనంద క్షణాలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



నందమూరి మోక్షజ్ఞ అరంగేట్రం ఖరారు..

నందమూరి అభిమానులు, తెలుగు సినీ ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న శుభ తరుణం రానేవచ్చింది. నటసింహం నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తేజ సినీ అరంగేట్రం అధికారికంగా ఖరారైంది. అతడి తొలి చిత్రానికి 'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్‌ను అందించిన యువ దర్శకుడు మల్లిడి వశిష్ఠ దర్శకత్వం వహించనున్నారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మించనుంది. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఈ భారీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు మైత్రీ మూవీ మేకర్స్ తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ ఫొటోలో బాలకృష్ణ, మోక్షజ్ఞ, దర్శకుడు వశిష్ఠ ముగ్గురూ కలిసి కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా మేకర్స్ ఒక పవర్‌ఫుల్ క్యాప్షన్‌ను జోడించారు. "డెన్‌ను వదిలిన కూన ఇప్పుడు సింహంలా అడవిలోకి ఎంటర్ అయింది" అంటూ మోక్షజ్ఞ ఎంట్రీని అభివర్ణించారు. ఈ ప్రకటనతో నందమూరి అభిమానుల్లో పండుగ వాతావరణం నెలకొంది. కొన్నేళ్లుగా మోక్షజ్ఞ ఎంట్రీ గురించి జరుగుతున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో పూర్తిస్థాయిలో తెరపడినట్లయింది. 'బింబిసార' చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ, ఇప్పుడు నందమూరి వారసుడిని హీరోగా పరిచయం చేసే బాధ్యతను తీసుకోవడం ప్రాజెక్ట్‌పై అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలతో పాటు, చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.

విలన్‌గా సుహాస్, హీరోగా సూరి.. ఉత్కంఠ రేపుతున్న 'మండాడి' ట్రైలర్!



టాలీవుడ్‌లో విలక్షణ నటనతో గుర్తింపు పొందిన యంగ్ యాక్టర్ సుహాస్, కోలీవుడ్‌లో విలన్‌గా అడుగుపెడుతున్నారు. తమిళ నటుడు సూరి హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మండాడి'లో సుహాస్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 10న విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.

తమిళనాడు తీరప్రాంతంలో జరిగే సాంప్రదాయ పడవ పందేల (సైల్ బోట్ రేసింగ్) నేపథ్యంలో ఈ సినిమాను హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. 'సెల్ఫీ' ఫేమ్ మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించడం విశేషం. సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్యరాజ్, రవీంద్ర విజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఆయన అందించిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం కోసం హీరో సూరి, విలన్ పాత్రధారి సుహాస్ డూప్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాల్లో, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో నటించినట్లు చిత్రబృందం తెలిపింది. ఇది వారి పాత్రల పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

మండపాల ఏర్పాటుకు అనుమతులు పూర్తిగా ఉచితం..

ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానం

రోడ్లను ఆక్రమించేలా మండపాలు ఏర్పాటు చేయొద్దు..

సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దు

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 6)

జిల్లాలో సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జిల్లా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా రోడ్లను ఆక్రమించేలా, ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేయరాదన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్/పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతులను సులభంగా ఒకే వేదిక ద్వారా పొందేందుకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ తెలిపారు. ఇందుకోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, అనుమతుల ప్రక్రియ పూర్తిగా ఉచితమని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

గణేష్ మండపం ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు గణేష్ ఉత్సవ్. నెట్ వెబ్‌సైట్‌లో 'న్యూ అప్లికేషన్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అనంతరం మొబైల్ నంబర్ నమోదు చేసి, ఫోన్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. దరఖాస్తుదారు పేరు, చిరునామా, కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జనం ప్రదేశం, సమయం, నిమజ్జనం కోసం వినియోగించే వాహనం తదితర వివరాలను నమోదు చేసి దరఖాస్తును సమర్పించాలి.

దరఖాస్తు సమర్పించిన అనంతరం ప్రత్యేక అప్లికేషన్ ఐడీ జనరేట్ అవుతుందని, సంబంధిత పోలీసు అధికారుల లాగిన్‌కు దరఖాస్తు వెళ్తుందని ఎస్పీ వివరించారు. అధికారులు పరిశీలించి అనుమతి మంజూరు చేసిన తర్వాత వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

అనుమతి పొందిన అనంతరం క్యూ ఆర్ కోడ్, నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలతో కూడిన



బుక్‌లెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. నిర్వాహకులు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ), నిబంధనల పత్రాలను ప్రింట్ తీసి మండపం వద్ద ఉంచాలని సూచించారు. ప్రతి అనుమతిపొందిన మండపానికి క్యూ ఆర్ కోడ్ తప్పనిసరిగా ఉంటుందని, దానిని మండపం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. గస్తీ పోలీసులు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అనుమతులను తనిఖీ చేస్తారని చెప్పారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

గణేష్ మండపాల్లో విద్యుత్ వైరింగ్‌ను సురక్షితంగా ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. షార్ట్ సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద తగినంత ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు.

ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లోనూ మండపాల వద్ద కొంతమంది బాధ్యత వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అధిక శబ్దంతో ఇబ్బందులు కలిగించొద్దు

గణేష్ మండపాలు, నిమజ్జన ఊరేగింపుల్లో అధిక శబ్దం వచ్చే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని సూచించారు.

పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర సున్నిత ప్రాంతాల వద్ద నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఇతరుల మనోభావాలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించరాదన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాల వద్ద, ఊరేగింపుల్లో తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

సోషల్ మీడియా వదంతులను నమ్మొద్దు

సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని వార్తలు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజలకు సూచించారు. వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా, ఏదైనా అనుమానం లేదా సమస్య ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని కోరారు.

కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్‌డివిజన్లలో శాంతియుత సమావేశాలు నిర్వహించి గణేష్ మండపాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

జిల్లా ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, యువత, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్112 లేదా డయల్100కు సమాచారం అందించాలని సూచించారు.

కర్నూలు జిల్లా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ సమన్వయంతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

గణపతి నిమజ్జనానికి నీళ్లు లేవనడం దారుణం

కేవలం 1 టీఎంసీ నీటితో నిమజ్జనానికి అవసరమైన నీరు సరిపోతుంది

ప్రజల ఆధ్యాత్మిక మనోభావాలను గౌరవించాలి: ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 6)

గణపతి నిమజ్జనానికి కర్నూలులో నీళ్లు లేవని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొనడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గణపతి నిమజ్జనం కర్నూలు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సంప్రదాయాలకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని, అలాంటి కార్యక్రమానికి నీళ్లు లేవని ప్రభుత్వం చెప్పడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.కేవలం 1 టీఎంసీ నీటిని వినియోగిస్తే కర్నూలులో గణపతి నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన నీరు సరిపోతుందని



ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించి గణపతి నిమజ్జనం కోసం ప్రభుత్వం వెంటనే అవసరమైన నీటిని అందించాలని డిమాండ్ చేశారు.

కర్నూలు ప్రజల విశ్వాసాలతో ప్రభుత్వం ఆటలాడవద్దని ఆయన అన్నారు. గణపతి నిమజ్జనానికి అవసరమైన నీటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈ అంశంపై ఎంత దూరమైనా వెళ్లి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.గణపతి నిమజ్జనానికి నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని, కర్నూలు ప్రజల ఆధ్యాత్మిక మనోభావాలను కాపాడేందుకు వైఎస్ఆర్సీపీ అండగా నిలుస్తుందని ఎస్వీ మోహన్ రెడ్డి తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 6,(రిపబ్లిక్ న్యూస్):- బండి ఆత్మకూరు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ, ఆయా పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బండి ఆత్మకూరు మండలంలోనీ జి.సి పాలెం లో ఒక అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. వీటి కోసం బీసీ.సి కేటగిరికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మండలంలోని ఏ.కోడూరు, సంత జూటూరు గ్రామాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మండలంలోని ఏ.కోడూరు ఏడబ్ల్యుసి.2లో ఓసి, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ, సంత జూటూరు ఏడబ్ల్యుసి 2లో బిసి.బి కేటగిరీకి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలు, అంగన్వాడి సహాయకులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే 01-07- 2026 నాటికి 21 యేళ్ల నుండి 35 యేళ్ల లోపు వయసు ఉండాలన్నారు. వీటితోపాటు వివాహితులై ఉండి స్థానికంగా నివాసం ఉన్నవారే అర్హులనీ సూపర్వైజర్ తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామంలో పేకాట రాయుళ్ల అరెస్టు



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 6రిపబ్లిక్ న్యూస్ ఆళ్లగడ్డ తాలూకా ఉయ్యాలవాడ మండల పరిధిలోని రూపనగుడి గ్రామ పొలిమేరలో గల కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఉయ్యాలవాడ పోలీసులు అరెస్టు చేశారు.ఈ ఘటనకు సంబంధించి ఉయ్యాలవాడ ఎ× రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురి లో ఇద్దరు పారిపోగా మిగిలిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుండి రూ. 5,100/- నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఐ రామిరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ మండల పరిధిలో ఎవరైనా సరే పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలి

టెట్ అర్హత లేకుండా డీఎస్సీలో ఉద్యోగాలు ఎలా వచ్చాయి?

దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: ఏఐవైఎఫ్

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 6)

2025 డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టెట్‌లో అర్హత సాధించని వారికి డీఎస్సీలో ఉద్యోగాలు ఎలా లభించాయని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు.

కర్నూలు జిల్లా కౌతాళం మండలంలో స్పోర్ట్స్ కోటాలో అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చిన వ్యవహారం వెలుగులోకి వచ్చిందని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రసారం చేసిన బిగ్ టీవీ కథనాలను నిలిపివేయడం మీడియా స్వేచ్ఛను అడ్డుకోవడమేనని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలపై చర్చకు సిద్ధమని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి తదితరులు పాల్గొన్నారు.



పదేపదే చెబుతున్న మంత్రి నారా లోకేష్.. మీడియా స్వేచ్ఛ విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.స్పోర్ట్స్ కోటాతో పాటు ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల కోటాల్లోనూ నకిలీ ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో ప్రభాకర్ గౌడ్ నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగం పొందినట్లు రుజువైందని ధ్రువపత్రాలతో 21 మంది ఉద్యోగాలు పొందినట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన వారితో పాటు వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనర్హుల స్థానంలో నిజమైన అర్హత కలిగిన డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం, మీడియాపై ఆంక్షలు విధించడం వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడితే ఏఐవైఎఫ్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. డీఎస్సీ అభ్యర్థులను కలుపుకొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని శ్రీనివాసులు తెలిపారు.

ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి బీసన్న, రాజు, రాజీవ్, జిల్లా సమితి సభ్యులు సురేష్, రాజు, నాగరాజు, మహేష్

వేధింపుల కారణంగా ఆత్మహత్య కేసు -నలుగురు నిందితుల అరెస్టు

నంద్యాల క్రైం, సెప్టెంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా పరిధిలోని గోస్పాడు మండలం, జిల్లెల్ల గ్రామానికి చెందిన తెలుగు వెంకట రాముడు (56) అను వ్యక్తి తన గ్రామంలోని గంగమ్మ ఆలయ కార్యకలాపాలను వంశపారంపర్యంగా నిర్వహిస్తూ వస్తున్నాడు. ఆలయ నిధులను దుర్వినియోగం చేశాడని 7 మంది వ్యక్తులు అతనిపై నిరాధార నిందలు మోపి, గ్రామంలో బహిరంగంగా పలుమార్లు అవమానించి మానసిక వేదనకు గురిచేశారని ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన సదరు వ్యక్తి సూసైడ్ నోట్ వ్రాసి 01/02.09.2026 అర్ధరాత్రి సమయంలో జిల్లెల్ల గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు తెలుగు హరి క్రిష్ణ (30) ఫిర్యాదు మేరకు



గోస్పాడు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాము. వారిలో నలుగురిని ఆదివారం ఉదయం అరెస్టు చేసి, చట్టప్రకారం న్యాయస్థానం ముందు హాజరుపరచడమైనది. మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేయుటకు ప్రత్యేక పోలీసు బృందాలు పనిచేస్తున్నాయి.

యువకుడు ఆత్మహత్య

బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 6,(రిపబ్లిక్ న్యూస్):- మండల కేంద్రం బండి ఆత్మకూరులోని వీవర్స్ కాలనీకి చెందిన లోకేష్ 19 అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం అవుకు మండలం, సింగన పల్లి గ్రామానికి చెందిన లోకేష్ తన పెద్దమ్మ పెదనాన్న అయినటువంటి బండి ఆత్మకూరుకు చెందిన కసిపోగుల నాగన్న ఇంటి వద్ద ఉండి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే లోకేష్ కు చదువుపై ఇష్టం ఉండేది కాదన్నారు. గత ఏడాది ఈ యువకుడు విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసిలో చేరి మధ్యలోనే చదువు మానేశాడని తెలిపారు. ఆతర్వాత ఆయన ఇష్ట ప్రకారం ప్రస్తుత ఏడాది బండి ఆత్మకూరులో చేరాడన్నారు. అయినప్పటికీ చదువుపై ఇష్టం లేక మనస్తాపానికి గురైన లోకేష్ ఇంట్లో ఏవరు లేని సమయం చూసి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. ఈ క్రమంలో మృతుడి తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. యువకుడి మృతితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



మృతుడు లోకేష్

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com